క్లుప్తంగా

జగనన్న ఇళ్లకు రూ.5 లక్షల చొప్పున ఇవ్వాలి

ఆరిలోవ: జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు రూ.5 లక్షల చొప్పున కేటాయించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ నాయకులు ఆరిలోవలో బుధవారం జగనన్న ఇళ్ల లబ్ధిదారులు ఉంటున్న ఇళ్లకు వెళ్లి కరపత్రాలు అందజేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న రూ.2.50 లక్షలు ఇంటి నిర్మాణానికి చాలడం లేదని, దాన్ని రూ.5 లక్షలకు పెంచి ఇవ్వాలని కోరారు. దీనిపై విజయవాడలో మార్చి 2న జరగనున్న మహా ధర్నాకు అంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎ.విమల, రెహమాన్, దేవుడమ్మ, లక్ష్మణరావు, రమణ పాల్గొన్నారు.

విద్యార్థిని చదువుకు చేయూత



విద్యార్థినికి సాయం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు కల్యాణ్

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 18వ వార్డు వాసవానిపాలెంలో అమ్మమ్మ, తాతయ్యల వద్ద ఉంటూ 10వ తరగతి విద్యనభ్యసిస్తున్న పల్లా అనిత అనే విద్యార్థినికి వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉమ్మిడి కల్యాణ్ రూ.5 వేలు సాయాన్ని అందజేశారు. పేద కుటుంబం కావడంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో అమ్మాయి చదువుకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో పుస్తకాలు కొనుగోలు కోసం ఈ సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గరికిన అప్పన్న, రమేష్, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్ర నామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

మహాభారతంపై సాహిత్య ప్రసంగం



ప్రసంగిస్తున్న సాహితీవేత్త టీపీఎన్ ఆచార్యులు

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రిజమ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మహాభారతంలో విశేషాంశాలు అనే అంశంపై సాహితీవేత్త టీపీఎన్ ఆచార్యులు ప్రసంగించారు. ముందుగా వ్యాసుని జన్మవృత్తాంతం.. ఆపై సహస్ర కవచ రాక్షసుడితో నరనారాయణుల యుద్ధం, ఒక్క కవచంతో సూర్యుడి శరణు వేడుట అతడే కర్ణుడిగా జన్మించడం, వాని సంహారానికి నరనారాయణులు కృష్ణార్జునులుగా పుట్టారని తెలిపారు. శకుంతలో పాఖ్యానం, ఉడిపి రాజు అనే సూరసేనుడు కురుక్షేత్ర సంగ్రామంలో ఇరుపక్క సైనికులకు ఆహారం వండి పెట్టడం, కలి ప్రవేశం, పరీక్షిత్తు క్రోధం, శృంగి శాపం, యాదవుల నాశనానికి కారణం వంటి విశేషాంశాలను కళ్లకు కట్టినట్టు వివరించారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ మహాభారతంలో ఎన్నో ధర్మ సూత్రాలు, జీవిత సత్యాలు నిక్షిప్తమై ఉన్నాయన్నారు. మహాభారతం నేటికీ మనందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు కె.జి.వేణు, డి.వి.సూర్యారావు, పరవస్తు ఫణిశయనసూరి, చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణమూర్తి, అయ్యల సోమయాజుల ప్రసాద్, గండికోట విశ్వనాథం, రామతాత, మాణిక్యాలరావు చర్చించారు.

ఆరిలోవలో జ్వరాల విజృంభణ

- రోగులతో ఆస్పత్రుల కిటకిట
- జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న వైద్యులు





ఆరిలోవలోని జీవీఎంసీ ఆస్పత్రిలో జ్వర పీడితులు

ఆరిలోవ: ఆరిలోవను జ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. వందలాది మంది జ్వర పీడితులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. రోజూ జ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఆరిలోవలోని జీవీఎంసీ ఆస్పత్రి, విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)కు కొద్ది రోజులుగా జ్వర పీడితుల తాకిడి ఎక్కువైంది. ఆయా ఆస్పత్రులలో రోజురోజుకూ ఓపీ పెరుగుతోంది. ఆరిలోవ కాలనీ నుంచి దుర్గాబజార్, టీఐసీ పాయింట్, బాలాజీనగర్, తోటగరువు, గాంధీనగర్ ప్రాంతాల నుంచి జ్వరాలతో బాధపడుతున్నవారు ఆరిలోవ ఆస్పత్రికి వెళ్తున్నారు. ఇక్కడ సాధారణంగా రోజూ 150 మంది వరకు ఓపీ నమోదవుతుండేది. వారం రోజులుగా ఆ సంఖ్య 200 నుంచి 250 వరకు ఓపీ ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. జ్వర పీడితులను వైద్యులు పరీక్షించి, అవసరమైన వారికి రక్త పరీక్షలు చేస్తున్నారు. ఎక్కువ మంది వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నట్టు ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ అనిత తెలిపారు. రోగులకు అవసరమైన మందులు అందిస్తున్నామన్నారు.

విమ్స్‌లోనూ అదే పరిస్థితి..

విమ్స్‌లో కూడా ఎక్కువగా జ్వర పీడితులతో ఓపీ నమోదవుతుంది. ఆరిలోవ ప్రాంతంతో పాటు పెదగదిలి, చినగదిలి, హనుమంతవాక, విశాలాక్షినగర్, సాగర్‌నగర్ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో జ్వరాలతో బాధపడుతున్నవారు విమ్స్‌కు వెళ్తున్నారు. ఇక్కడ నిత్యం సుమారు 500 మంది వరకు నమోదయ్యే ఓపీ వారం రోజులుగా జ్వరాల బాధితులతో రోజుకు 650 దాటుతుందని వైద్యులు చెబుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో కూడా ఎక్కువ మంది జ్వరాలతో బాధపడుతున్న వారే కనిపిస్తున్నారు. వాతావరణంలో మార్పుల వల్ల ఎక్కువ మంది జ్వరాలు బారిన పడుతున్నారని అంటున్నారు. వేసవి ప్రారంభం కావడంతో పాటు ఉదయం, సాయంత్రం సమయాలలో మంచు, చలి గాలులకు జనం జ్వరాల బారిన పడుతున్నారని వైద్యులు భావిస్తున్నారు. రోజూ మంచి నీరు ఎక్కువగా తాగాలని, ఎండలో తిరగవద్దని సూచిస్తున్నారు.



జ్వరాలతో బాధపడుతున్న వారితో రద్దీగా విమ్స్ ఓపీ విభాగం

అవగాహనతో క్యాన్సర్ నివారణ సాధ్యం



క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం సిబ్బంది

ఎంవీపీ కాలనీ: ముందస్తు అవగాహనతో క్యాన్సర్ నివారణ సాధ్యమవుతుందని ఎంవీపీ కాలనీలోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి అన్నారు. బుధవారం కేంద్రం ఆధ్వర్యంలో హెల్త్ సెక్రటరీలతో కలిసి విద్యార్థులను భాగస్వాములను చేస్తూ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్యాన్సర్ నివారణపై విద్యార్థులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ ముందస్తు గుర్తింపు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లుతో క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. పొగాకు ఉత్పత్తుల వినియోగానికి ప్రజలు దూరంగా ఉండాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్లాక్ లెవల్ హెల్త్ మేళా పేరుతో ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు సచివాలయాలకు చెందిన హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.

పోలమాంబ సన్నిధిలో ప్రొద్దుటూరు ఎమ్మెల్యే



పోలమాంబ ఆలయంలో ప్రొద్దుటూరు ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, తదితరులు

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరులోని కరకచెట్టు పోలమాంబ ఆలయాన్ని బుధవారం ప్రొద్దుటూరు ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి సందర్శించారు. ఆయనకు ఆలయ చైర్మన్ పి.శంకర్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాదు మంగరాజు, నీలాపు నైటమ్మ, నందూరి కృష్ణమోహన్, గొంప సంతోష్ కుమార్, మరడ నాగమణి, ఆలయ ప్రధాన అర్చకుడు సుదర్శనం సత్య శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సుధాకర్ విజయమే లక్ష్యం

ఎంవీపీ కాలనీ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సుధాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్టీ తూర్పు నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఆమె బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయనిర్మల మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గం నుంచి అత్యధిక శాతం ఓట్లు వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి పడేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇందు కోసం ప్రత్యేక కార్యచరణతో పని చేయాలని సూచించారు. 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రతి వార్డులోనూ ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ వివరించడంతో పాటు లబ్ధి పొందిన ప్రతి ఒక్కరినీ గృహసారథులు కలిసి ప్రభుత్వ పనితీరును తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్యనాయకులు, కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

సౌభాగ్యలక్ష్మిగా దుర్గాలమ్మ



సౌభాగ్యలక్ష్మిగా దర్శనమిస్తున్న దుర్గాలమ్మ

దాబాగార్డెన్స్: పూర్ణామార్కెట్‌లోని వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా బుధవారం సౌభాగ్యలక్ష్మిగా దుర్గాలమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రంగుల గాజులతో విశేషంగా అలంకరించారు. ప్రత్యేక అర్చనలు, విశేష పూజలు జరిపారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ నాయన మల్లిబాబు పాల్గొన్నారు.

ఉద్యోగం సాధించడం ఒక వరం



క్యాంపస్ ఉద్యోగార్థుల తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: డిప్లమో స్థాయిలో పాలిటెక్నిక్ విద్యార్థులు ఉద్యోగం సాధించడం వరమని, దీన్ని సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. బెంగళూరుకు చెందిన నెట్టూర్ టెక్నికల్ ట్రైనింగ్ ఫౌండేషన్(ఎన్‌టీటీఎఫ్) ఇటీవల నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఈ కళాశాల నుంచి 13 మంది బాలికలు ఉద్యోగాలు పొందారు. ఈ నేపథ్యంలో వీరి తల్లిదండ్రులు, కంపెనీ ప్రతినిధులతో బుధవారం ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా ఉద్యోగులకు కంపెనీలో పూర్తి రక్షణ ఉంటుందని వివరించారు. బాలికల తల్లిదండ్రులు అడిగిన పలు సందేహాలను ఎన్‌టీటీఎఫ్ ప్రతినిధులు నివృత్తి చేశారు. ఉద్యోగంలో చేరిన వారందరికీ రెండు నెలలు శిక్షణ ఇస్తామన్నారు. ఇందులో భాగంగా సాంకేతిక నైపుణ్యాలు, సాఫ్ట్ స్కిల్స్, సేఫ్టీ, సమగ్ర అభివృద్ధి వంటి అంశాల్లో శిక్షణ ఉంటుందని, అభ్యర్థులు శ్రీపెరంబదూర్‌లోని ఫస్ట్ సోలార్ కంపెనీలో పని చేయాల్సి ఉంటుందని చెప్పారు. అమెరికా, మలేసియా, వియత్నాం వంటి దేశాల్లోని ఫస్ట్ సోలార్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో కంపెనీ స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం మేనేజర్ సీపీ రమేష్ బాబు, సీనియర్ ఆఫీసర్ ఎస్.గీత, మెయింటెనెన్స్ ఇంజినీర్ బి.సాహుల్ ఇబ్రహీం, హెఆర్ విభాగం ప్రతినిధులు దియానా సీక్విరా, నిర్మలా దేవి, నివేదా, కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ వివిధ విభాగాల హెడ్‌లు డాక్టర్ బీవీ లక్ష్మణరావు, డాక్టర్ ఎస్.ప్రశాంతకుమారి, డి.దామోదర్, టీపీవో సీహెచ్ జయప్రకాష్‌రెడ్డి, ఏటీపీవో కుమార్ పాల్గొన్నారు.

10 కిలోల గంజాయి స్వాధీనం

పోలీసుల అదుపులో ముగ్గురు వ్యక్తులు



స్వాధీనం చేసుకున్న గంజాయి, నగదు

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ముగ్గురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. వారు తెలిపిన వివరాలిలా.. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ వద్ద గంజాయి రవాణా జరుగుతోందనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అనుమానస్పద వ్యక్తుల వద్ద సోదాలు చేశారు. 10 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి ముగ్గురు వ్యక్తుల నుంచి దానితోపాటు రూ.1,500 స్వాధీనం చేసుకుని ఫోర్త్ టౌన్ పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథరావు మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ ఆదేశాల మేరకు స్పెషల్ బ్రాంచ్ అడిషనల్ కమిషనర్ గంగాధర్ పర్యవేక్షణలో సోదాలు చేశామన్నారు. కేరళ తిరువనంతపూర్‌కు చెందిన సురేష్‌కుమార్, అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట బొడ్డపుట్టుకు చెందిన మజ్జి బాలకృష్ణ, మజ్జి అరుణలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

18న ఎరుకుమాంబ ఆలయంలో శివరాత్రి మహోత్సవాలు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన శ్రీ ఎరుకుమాంబ అమ్మవారి ఆలయంలో ఈనెల 18వ తేదీన మహాశివరాత్రి మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఈవో రమాబాయి తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అమ్మవారికి కుంకుమార్చనలు, దర్శనలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు పురవీధుల్లో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ప్రత్యేక ఆహ్వానితులుగా దేవదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎం.వెంకటసురేష్‌బాబు, ఉప కమిషనర్ ఎస్.సుజాత, సహాయ కమిషనర్ కె.శిరీష పాల్గొంటారన్నారు.

రెండు తులాల బంగారం చోరీ

భీమునిపట్నం: భీమిలి చిన్నబజారు జంక్షన్ సమీపంలోని ఇంట్లో బుధవారం రెండు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. దివీస్ కంపెనీలో కలిదిండి నోహర్ అనే వ్యక్తి పని చేస్తుండగా అతని భార్య జ్యోష్న సమీపంలోని సన్‌స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తున్నారు. వీరి ఇద్దరు పిల్లలు స్కూల్‌కు వెళ్తుంటారు. వీరంతా ఇక్కడ ఒక ఇంట్లోని రెండో అంతస్తులో నివసిస్తున్నారు. ఎప్పటిలాగే భార్య, భర్త ఉద్యోగాలకు, పిల్లలు స్కూల్‌కు బుధవారం ఉదయం వెళ్లిపోయారు. ఈ క్రమంలో జ్యోష్న ఇంటికి తాళం వేయడం మర్చిపోయారు. సాయంత్రం ఆమె వచ్చి చూడగా ఇంట్లోని బీరువాలో రెండు తులాల బరువున్న చెవి దిద్దులు, ఒక గొలుసు, రెండు చేతి ఉంగరాలు చోరీకి గురైనట్టు గుర్తించారు. వెంటనే క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిలకపాలెం టోల్‌ప్లాజా కార్మికుల ధర్నా



హనుమంతవాక బస్ స్టాప్ వద్ద ధర్నా చేస్తున్న చిలకపాలెం టోల్‌ప్లాజా కార్మికులు

ఆరిలోవ: శ్రీకాకుళం జిల్లా చిలకపాలెం టోల్ ప్లాజా కార్మికులు బుధవారం హనుమంతాక వద్ద ధర్నా చేశారు. ఇటీవల చిలకపాలెం టోల్ ప్లాజాను మూసేశారు. దీంతో ఇప్పటి వరకు పనిచేసిన కార్మికులు తమకు న్యాయం చేయాలని కొద్ది రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఇందులో భాగంగా హనుమంతవాక సమీపంలో ఉన్న భారత జాతీయ రహదారుల నిర్వహణ సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నాకు దిగారు. ఇందుకు పోలీసులు అనుమతించకపోవడంతో ఎన్‌హెచ్‌ఏఐ సమీపంలోని హనుమంతవాక ఆర్టీసీ బస్ స్టాప్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ క్రమంలో ఆరిలోవ సీఐటీయూ నాయకుడు కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ విశాఖ జిల్లా కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి తేజేశ్వరరావు మాట్లాడుతూ టోల్ ప్లాజా కార్మికులకు వెంటనే ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రోడ్డున పడిన 106 మంది కార్మికులకు అందుబాటులో ఉన్న మడపాము, నాతవలస టోల్ ప్లాజాలలో ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. దీనిపై సంబంధిత అధికారులు, అసెంబ్లీ స్పీకర్, రెవెన్యూ మంత్రికి వినతి పత్రాలు అందించినా ఫలితం కనిపించలేదన్నారు. కార్మికులకు న్యాయం చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో టోల్ ప్లాజా యూనియన్ నాయకులు డి.వి.నర్సింహులు, వి.వెంకటరమణ, మూర్తి, అప్పారావు, రాజేశ్వరరావు, మురళి, శంకరనారాయణ పాల్గొన్నారు.

మహాశివరాత్రికి తీరం ముస్తాబు



సాగరతీరంలో ఏర్పాటు చేస్తున్న మహా శివలింగం

బీచ్ రోడ్డు: మహా శివరాత్రి వేడుకలకు సాగర తీరం ముస్తాబవుతోంది. జాగరణ కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. టి.సుబ్బరామిరెడ్డి కళా పీఠం ఆధ్వర్యంలో ఆర్కే బీచ్‌లో శనివారం నిర్వహించనున్న మహా కుంభాభిషేకం కోసం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్లాస్టిక్ నియంత్రణలో డీఆర్‌వోపీ సేవలు భేష్



డీఆర్‌వోపీ లోగో, జూట్ బ్యాగులు ఆవిష్కరిస్తున్న జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు

ఎంవీపీ కాలనీ: ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణకు డెవలప్ రెస్పాన్సిబుల్ అవుట్‌లుక్ ఫర్ ప్లాస్టిక్(డీఆర్‌వోపీ) అందిస్తున్న సేవలు అభినందనీయమని జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు అన్నారు. డీఆర్‌వోపీ విశాఖలో సేవల ప్రారంభ కార్యక్రమాన్ని బుధవారం లాసన్స్‌బే కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌వోపీ లోగోతో పాటు జూట్ బ్యాగ్‌లను ఆవిష్కరించారు. బీచ్ క్లీనింగ్ ప్రొగ్రాంను సైతం ప్రారంభించారు. అనంతరం సన్యాసిరావు మాట్లాడుతూ వ్యర్థాలతో పాటు ప్లాస్టిక్ నియంత్రణలోను నగర వాసులను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని సూచించారు. గత కొంత కాలంగా ఐపీసీఏ, కియా ద్వారా వ్యర్థాలు, ప్లాస్టిక్ నియంత్రణకు అందిస్తున్న సేవలను కొనియాడారు. ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ కౌసికా సరవరణ్ మాట్లాడుతూ ఇండియన్ పొల్యూషన్ కంట్రోల్ అసోసియేషన్, కియా ఇండియా అసోసియేషన్ సంయుక్త సహకారంతో డీఆర్‌వోపీ సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటికే బెంగళూరు, ముంబయి, విజయవాడ, గుర్‌గ్రామ్‌లలో సంస్థ ద్వారా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. వ్యర్థాల నియంత్రణపై అవగాహన, రీసైక్లింగ్ అంశాల్లో వినియోగదారుల భాగస్వామ్యం పెంచడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ మేరకు విద్యార్థులు భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు, అపార్టుమెంట్‌ల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్-2 కమిషనర్ విజయలక్ష్మి, జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

సమాచారమ్

హెచ్‌పీసీఎల్‌లో ఏయూ విద్యార్థుల ఇంటర్న్‌షిప్ పూర్తి



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: హెచ్‌పీసీఎల్‌లో ఏయూ వృక్షశాస్త్ర విభాగం విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌ను పూర్తి చేశారు. ఏయూతో గతంలో హెచ్‌పీసీఎల్ చేసుకున్న అవగాహన ఒప్పందంలో భాగంగా హెచ్‌పీ హరిత ప్రాజెక్టును ప్రారంభించారు. దీనిలో ఏయూ వృక్షశాస్త్ర విభాగానికి చెందిన విద్యార్థులు వృక్ష సంబంధ అధ్యయనం చేశారు. హెచ్‌పీసీఎల్‌కు చెందిన వాల్తేర్ పార్క్, యారాడ హౌసింగ్ కాలనీలో ఉన్న వృక్ష సముదాయం, అరుదైన మొక్కలపై పీజీ విద్యార్థులు పరిశోధన జరిపారు. అదే విధంగా ఆయా ప్రాంతాలలో నూతనంగా ఉద్యానవనాల అభివృద్ధికి పలు సూచనలు చేశారు. విజయవంతంగా ఇంటర్న్‌షిప్‌ను పూర్తిచేసిన విద్యార్థులకు హెచ్‌పీసీఎల్ సంస్థ సర్టిఫికెట్లను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో అభినందించారు.

ఆరంభ శూరత్వం.. ఆచరణలో అలసత్వం

- విమ్స్‌లో ప్రారంభించిన రోజే మూతపడిన బ్లడ్ బ్యాంకు
- నదుపాయాలు లేక రక్త నిల్వలకు ఇబ్బందులు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన రక్తనిధి(బ్లడ్ బ్యాంక్) కేంద్రం ప్రస్తుతం మూతపడి ఉంది. ఇక్కడ ఓ బ్లాక్‌లో రక్తనిధి కేంద్రం ఏర్పాటు చేశారు. దీన్ని రాష్ట్ర ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ టి.కృష్ణబాబు గతేడాది డిసెంబరు 19న ప్రారంభించారు. ఇక్కడ అన్ని విభాగాలలో వందలాది శస్త్ర చికిత్సలు జరుగుతుంటాయి. ఆయా సమయాల్లో అవసరమైన రక్త కోసం రోగుల బంధువులు బయటకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. రెడ్‌క్రాస్, ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ తదితర వాటిని అత్యవసరంగా సంప్రదించి రక్తం తీసుకొస్తున్న పరిస్థితులు ఉన్నాయి.

ఈ సమస్య లేకుండా శస్త్ర చికిత్స చేసే సమయంలో రోగికి అవసరమైన రక్తం ఆస్పత్రిలోనే అందుబాటులో ఉండాలన్న ఆలోచనతో విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు కృషితో రక్తనిధి ఏర్పాటుకు రాష్ట్ర వైద్యాధికారులు అనుమతిచ్చారు. ఈ మేరకు ఆస్పత్రిలో రక్తనిధి ఏర్పాటు చేసి సుమారు రెండు నెలలు కావస్తోంది. అంత వరకు బాగానే ఉంది. కానీ రక్తం నిల్వ చేయడానికి అవసరమైన సదుపాయం, పరికరాలు, సంబంధించిన యంత్రాలు ఇంతవరకు సమకూర్చలేదు. దీంతో ప్రారంభించిన మరుసటి రోజు నుంచి ఈ కేంద్రానికి తాళం వేసేశారు. దీంతో రోగుల బంధువులు శస్త్ర చికిత్సల సమయంలో రక్తం కోసం ఎప్పటిలాగే బయట బ్లడ్ బ్యాంక్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ కేంద్రంలో అవసరమైన సదుపాయాలు కల్పించి, రక్తం అందుబాటులో ఉంచాలని రోగుల బంధువులు కోరుతున్నారు.



విమ్స్‌లో తాళం వేసి ఉన్న రక్తనిధి కేంద్రం

రేషన్ డిపోపై కేసు



డిపోలో బియ్యం పరిశీలిస్తున్న అధికారులు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు భీమిలి బీచ్‌రోడ్డు మంగమారిపేట రేషన్ డిపోలో బుధవారం అధికారులు తనిఖీ చేశారు. డిపోలో పప్పు, బియ్యం పక్కదారి పడుతున్నాయని అందిన ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్లు రమణ, మహేష్ తనిఖీ చేశారు. ఉండాల్సిన నిల్వ కంటే 100 కేజీల పప్పు, 40 కేజీల బియ్యం తక్కువ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు నేరెళ్లవలసలో నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఈ ప్రాంతానికి చెందిన దుర్గ ఉగ్రనరసింహ మూర్తి ఇంట్లో నిల్వ చేసిన 1100 కేజీల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ సీఐ భారతి బుధవారం సీజ్ చేసి కేసు నమోదు చేశారు.